క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పారిశుధ్య కార్మికులతో డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్న శివల సర్పంచ్ సాయి

కె.గంగవరం: గ్రామంలోని ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ అనుసూరి సాయి సూచించారు. మండలంలోని శివలలో శుక్రవారం డ్రై డే సందర్భంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి వీధిలో ఉన్న డ్రైనేజీలు క్లీన్ చేయించి చెత్తను తొలగించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

మండపేట: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు మండపేటలో ధర్నా నిర్వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు సీఐటీయూ నాయకురాలు కె. కృష్ణవేణి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు కొమరపు నరేంద్ర, బంగారు కొండ, కె. విజయ్, నాగేంద్ర ప్రసాద్, చిన్న, రాజు, లావ రాజు, హేమలత, రత్నం తదితరులు పాల్గొన్నారు.

టేకి సొసైటీ చైర్మన్‌గా 'పుట్టా'



టేకి సొసైటీ పాలకవర్గంతో ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: టేకి సొసైటీ చైర్మన్‌గా పుట్టా జానకి రామయ్య, డైరెక్టర్లుగా నరాల సూర్యనారాయణ, గంటి సీతాదేవి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు ఉమ్మిడిశెట్టి వీరవేణి, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కుక్కల బాలయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి పాల్‌రాజ్, మేడిశెట్టి దుర్గారావు, ఉమ్మిడిశెట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందించడమే ఉద్యోగి కర్తవ్యం



ఎంవీఐ రాజేంద్రప్రసాద్‌ను మెమెంటోతో సత్కరించిన చక్రవర్తి తదితరులు

రామచంద్రపురం: ఉద్యోగ నిర్వహణలో భాగంగా ప్రజలకు ఉత్తమ సేవలను అందించటమే కాకుండా వారి ఉద్యోగ కర్తవ్యాన్ని ఎంతో గొప్పగా నిర్వహించి ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్న అధికారులను సత్కరించినట్లు లారీ ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న రామచంద్రపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, డీఎస్పీ కేఎస్ఎన్ ప్రసాద్, ఎస్సై డి.సురేష్‌బాబులను లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చక్రవర్తి తదితరులు మెమెంటోలు అందించి ఘనంగా సత్కరించారు.

సూరిపండుకు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

మండపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన తాపేశ్వరానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత గ్రంధి సూరిపండును శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, మండపేట సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, వీరాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ సూరంపూడి సత్యప్రసాద్, కేశవరం వార్డు సభ్యుడు గనిశెట్టి సత్తిబాబు, పార్టీ నాయకుడు యాంద్ర బుజ్జి తదితరులు తాపేశ్వరంలోని ఆయన స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బడులకు మహర్దశ



ఏడిదలో అభివృద్ధి చేసిన మండల పరిషత్ పాఠశాల



నాడు -నేడులో మెర్నిపాడులో అభివృద్ధి చేస్తున్న మండల పరిషత్ పాఠశాల

- 'నాడు- నేడు'తో మారిన రూపురేఖలు
- కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- రెండు విడతల్లో రూ.34.11 కోట్లతో అభివృద్ధి

మండపేట: శిథిల భవనాలు.. పెచ్చులు ఊడే పై కప్పులు.. అధ్వాన్నంగా ఉండే టాయిలెట్లు.. రాళ్లు పైకి లేచిన ఫ్లోరింగులు.. కలుషిత తాగునీరు.. ఇదీ గతంలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పాఠశాలల స్వరూపాన్నే మార్చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. నాడు- నేడు పథకం ద్వారా కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు.

మూడు విడతల్లో మొత్తం పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడత పనులు పూర్తి కాగా రెండో విడత పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. మండపేట పట్టణం, మండల గ్రామాల్లో మొత్తం 68 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా రెండు విడతల్లో రూ.34.11 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. టాయిలెట్స్ విత్ రన్నింగ్ వాటర్, విద్యుద్దీకరణ, పెయింటింగ్స్, ఫర్నిచర్, తాగునీరు, మేజర్, మైనర్ మరమ్మతులు, ప్రహరీలు, గ్రీన్ బోర్డులు, ఇంగ్లిష్ ల్యాబ్ తదితర నిర్మాణ పనులు చేపట్టారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా శరవేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. రెండో విడత పనులు దాదాపు పూర్తయినట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. త్వరలో మూడో విడత పనులు మొదలు కానున్నాయి.

మండపేట పట్టణం, మండలంలో నాడు- నేడు రెండు విడతల్లో జరిగిన అభివృద్ధి

	ఫేజ్ 1 పాఠశాలలు	సొమ్ము (రూ.కోట్లలో)	ఫేజ్ 2 పాఠశాలలు	సొమ్ము (రూ.కోట్లలో)
మండపేట అర్బన్	24	5.48	47	14
మండపేట రూరల్	16	3.63	35	11

పేదల విద్యను ప్రోత్సహిస్తూ..

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పేదరికం చదువు అడ్డంకి కారాదన్న ఉద్దేశవతో అమ్మఒడి పథకంతో పాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. జగనన్న విద్యాకానుక ద్వారా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు, షూలు తదితర కిట్లు అందిస్తున్నారు. జగనన్న ఆణిముత్యాలు పథకం ద్వారా ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. బాల స్వస్థత ద్వారా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

సొంత నిధులతో మొదటి అంతస్తు



'నాడు -నేడు' పథకంలో మండల పరిషత్ పాఠశాలను అభివృద్ధి చేస్తున్నాం. రూ. 25 లక్షలు మంజూరు కాగా అదనపు తరగతి గది నిర్మాణం జరుగుతోంది. విద్యార్థుల కోసం అదనంగా సుమారు రూ.13 లక్షల సొంత నిధులు వెచ్చించి మొదటి అంతస్తు నిర్మాణం చేస్తున్నాం.

– గారపాటి సౌజన్య, సర్పంచ్, మెర్నిపాడు

'నాడు- నేడు'తో అభివృద్ధి



బీసీ ఏరియాలోని ఎంపీపీ పాఠశాల ఫ్లోరింగ్ కిందకు దిగిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. రూ.16 లక్షలు మంజూరు కాగా ఇప్పటికే ఫ్లోరింగ్, గ్రిల్స్ నిర్మాణంతో పాటు వంటషెడ్డు అభివృద్ధి పనులు జరిగాయి. విద్యుత్తు, టాయిలెట్స్ పనులు మొదలయ్యాయి.

– పిల్లా వెంకటలక్ష్మి, సర్పంచ్, పాలతోడు

స్కూళ్లను బాగా అభివృద్ధి చేశారు



మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. సీఎం జగన్ సార్ అన్ని వసతులు కల్పించి ప్రభుత్వ పాఠశాలలను బాగా అభివృద్ధి చేశారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక తదితర పథకాలు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

– పైడిమళ్ల సురేఖ, విద్యార్థి తల్లి, ఏడిద

సీఎం పాలనలో పల్లెల పురోగతి



వంతెన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కుయ్యేరు సర్పంచ్ కృష్ణమూర్తి, గ్రామ పెద్దలు

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పాలనలో పట్టణాలకు దీటుగా పల్లెలు పురోగతి చెందుతున్నాయని వైఎస్సార్ సీపీ నేత, కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి అన్నారు. కుయ్యేరు శివారు చలివేంద్రపాడులో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ కృష్ణమూర్తి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వంలో స్థానికులు మంత్రి వేణుగోపాలకృష్ణకు విన్నవించిన మేరకూ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని పనులు పూర్తయితే గ్రామంలో దారి మార్గం సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, మేడిశెట్టి సత్యనారాయణ, పలువురు స్థానిక పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ముసురుతో మూతపడిన చిరు వ్యాపారాలు



వెదురుమూడి బట్టీలో ఇటుక ముద్దలపై బరకాలను కప్పి ఉన్న దృశ్యం

కపిలేశ్వరపురం: గ్రామాల్లో శుక్రవారం పట్టిన ముసురుతో చిరు వ్యాపారాలు మూత పడ్డాయి. తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి సాధారణ జీవనం స్తంభించింది. ద్విచక్ర వాహనాలపై జామకాయలు, కూరగాయలు, అల్పాహారాలను విక్రయించుకునేవారు తమ విక్రయాలను నిలిపి వేసుకున్నారు. కేదారిలంక, వీధివారిలంక, అంగర, వెదురుమూడి, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురంలలో ఉన్న ఇటుక బట్టీల్లో ఉత్పత్తి కార్యకలాపాలు నిలిచిపోయాయి. విజయనగరం, శ్రీకాకుళం తదితర దూరపు ప్రాంతాల నుంచి పనికి వచ్చిన వలస కూలీలు ఖాళీ అయ్యారు.

దిశ యాప్ మహిళలకు రక్షణ కవచం

కపిలేశ్వరపురం: రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్ మహిళలు, చిన్నారులకు రక్షణ కవచమని పలు గ్రామాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలన్నారు. వల్లూరు, అంగర, కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లో మహిళా పోలీసుల ఆధ్వర్యంలో దిశ యాప్ ఇన్‌స్టలేషన్ పద్ధతిపై మహిళలకు అవగాహన కల్పించారు. వారి మొబైళ్లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి వాడుకునే విధానపై అవగాహన కల్పించారు.

కల్వర్టు నిర్మించాలి



కూళ్ల రహదారిలో కల్వర్టు లేక ప్రమాదకరంగా ఉన్న రహదారి

కె.గంగవరం: మండలంలోని కూళ్ల-పామర్రు ప్రధాన రహదారిపై ఉన్న పంట కాలువలకు కల్వర్టు నిర్మించకపోవడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ రహదారిలో రెండు చోట్ల ప్రధాన రహదారికి కేవలం తూరలు వేసి ఇరువైపులా స్తంభాలు పాతారు. దీని వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ రహదారిలో వెళ్లడానికి వాహదారులు భయపడుతున్నారు. ఈ దారిలో పంట కాలువలకు రెండు చోట్ల నూతన కల్వర్టులను నిర్మించి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

చంద్రబాబు పర్యటనతో ఎమ్మెల్సీ 'తోట'కు భయం

మండపేట: మాజీ సీఎం చంద్రబాబునాయుడు మండపేట పర్యటనతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు ముచ్చెమటలు పడుతున్నాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. ప్రజా సమస్యలపై తాము ప్రశ్నిస్తే ఎమ్మెల్సీ తోట చెప్పిందే చెబుతూ సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు.

మిగిలిన ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి



సోమేశ్వరం జగనన్న కాలనీలో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- సోమేశ్వరం జగనన్న కాలనీ సందర్శన

రాయవరం: మండలంలోని సోమేశ్వరం గ్రామంలోని జగనన్న లేఅవుట్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం సందర్శించారు. ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాలోని రాయవరం మండలం సోమేశ్వరం జగనన్న కాలనీని మోడల్ కాలనీగా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా కాలనీని సందర్శించి, ఇళ్ల నిర్మాణాల ప్రగతిని, అక్కడి మౌలిక వసతులను పర్యవేక్షించారు. కాలనీలో అవసరమైన ఇంటర్నల్ రహదారులు, వెల్‌కమ్ ఆర్చ్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మిగిలిన ఇళ్లను కూడా నెలాఖరుకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఇళ్లు నిర్మించిన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారిని ఇంటిని ఏ విధంగా నిర్మించుకున్నారంటూ ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు మంజూరు ఎలా ఉందనే విషయాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. అద్దె ఇళ్లలో కష్టాలు అనుభవించిన తమకు ప్రభుత్వం ఎంతో మేలు చేసిందన్నారు. మిగిలిన లబ్ధిదారులు వేగవంతంగా గృహ నిర్మాణాలు చేసుకునేలా చైతన్యం చేయాలని సర్పంచ్ ఆరిఫ్‌కు సూచించారు. సోమేశ్వరం జగనన్న కాలనీలో 136 ఇళ్లకు 104 ఇళ్లు పూర్తి చేసినట్టు హౌసింగ్ పీడీ సీహెచ్.బాబూరావు విలేకరులకు తెలిపారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లా రాయవరం సచివాలయం-2ను సందర్శించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సీహెచ్ బాబూరావు, డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్, ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, ఎంఏవో కొప్పిశెట్టి ప్రభాకర్, హౌసింగ్ డీఈఈ రఘురామకుమార్, ఏఈ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఉప ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు



ఎన్నికల అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ సింధు సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరు సర్పంచ్ పదవికి శనివారం నిర్వహించనున్న ఉప ఎన్నికకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఆర్డీఓ పి.సింధు సుబ్రహ్మణ్యం శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, సిబ్బందితో ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియలో పీఓలు, ఏపీఓలు అనుసరించాల్సిన విధి, విధానాలపై మాస్టర్ ట్రైనర్, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, పలు సూచనలు చేశారు ఎన్నికలను ఎటువంటి అపోహలకు తావు లేకుండా నిర్వహించాలని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ పి.రామకృష్ణారెడ్డి, డీఎల్‌డీఓ ఎ.శాంతి, ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు, ఎలక్షన్ హెల్ప్‌డెస్క్ ప్రతినిధులు పోచినపెద్ది విశల్, చేగొండి శ్రీరామ్ పాల్గొన్నారు.

వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలి

సర్పంచ్ బుంగ మేరీ మృతితో ఉప ఎన్నికల జరుగుతున్న ఓదూరులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ పి.సింధు సుబ్రహ్మణ్యం శుక్రవారం పరిశీలించారు. గ్రామంలోని 10 పోలింగు కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజును ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ పి.రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మండపేట: మండలంలోని తాపేశ్వరం పంచాయతీ 14వ వార్డుకు శనివారం జరగనున్న ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి, ఎంపీడీఓ ఐ. రాజు తెలిపారు. గ్రామ శివారు పేకేటిపాకలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి పంచాయతీ కార్యాలయం వద్ద ఓట్లు లెక్కించి విజేతను ప్రకటించనున్నట్టు శుక్రవారం ఆయన తెలిపారు. వార్డు పరిధిలో 504 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రశాంత వాతావరణంలో ఉప ఎన్నిక నిర్వహణకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ రాజు విజ్ఞప్తి చేశారు. ఉప ఎన్నిక సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

నయనానందకరంగా నవనీత హారతి



రాయవరంలో నిర్వహించిన నవనీత హారతి

రాయవరం: గోవిందా గోవింద..నవనీత చోర..నంద నందనా అంటూ భక్తుల నామ స్మరణతో శ్రీవారి ఆలయం మార్మోగింది. స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నవనీత హారతి వేడుకను కనులపండుగగా నిర్వహించారు. టీటీడీ అర్చకులు, శ్రీనివాస మంగాపురం ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యుల ఆధ్వర్యంలో నవనీత హారతిని అంగరంగ వైభంగా నిర్వహించారు. తొలుతగా శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆవు పాల నుంచి తీసిన పచ్చి వెన్నను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అలాగే వెన్నతో జ్యోతులను వెలిగించారు. పూజల అనంతరం భక్తులకు వెన్నను ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రం రోజు నవనీత హారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీనివాసమంగాపురం ప్రధాన అర్చకులు బాలాజీరంగాచార్యులు మాట్లాడుతూ స్వామివారికి ప్రీతిపాత్రమైన నవనీత హారతిని రాయవరం ఆలయంలో నిర్వహించడం గొప్ప విషయమన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, అయ్యప్ప పీఠం గురుస్వామి పులగం శ్రీనివాసరెడ్డి, అధిక సంఖ్యలో గ్రామస్తులు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాలకు శ్రావణ శోభ



ప్రత్యేక అలంకరణలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు



గొల్లపాలెం దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కాజులూరు: శ్రావణమాసం వచ్చిందంటే చాలు అమ్మవారి ఆలయాలు భక్తుల తాకిడితో కిటకిటలాడుతుంటాయి. ప్రధానంగా శ్రావణపౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి అమ్మవారి వ్రతాన్ని మహిళలు ప్రత్యేకంగా ఆచరిస్తారు. దాంతో పాటు శ్రావణమాసంలో వచ్చే ఐదు వారాలను మహిళలు పుణ్యదినాలుగానే భావిస్తారు. ఈ క్రమంలో శుక్రవారం కాజులూరు మండల గ్రామాల్లో పలువురు మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించి ఆలయాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని 26 గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లోను ప్రత్యేక పూజలు జరిగాయి.

ద్రాక్షారామలో..

రామచంద్రపురం రూరల్: నిజ శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని ఆలయాలు కిటకిటలాడాయి. మహిళా భక్తులు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ప్రత్యేకించి కనకదుర్గ, వాసవీ కన్యకా పరమేశ్వరి, సంతోషిమాత తదితర అమ్మవార్ల ఆలయాలను భక్తులు సందర్శించి పూజలు నిర్వహించుకున్నారు. 12వ శక్తిపీఠం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పీఠంలో శ్రీరామ పాదుకా పట్టాభిషేకం



భక్తులతో కలసి కల్యాణాన్ని వీక్షిస్తున్న పీఠాధిపతి గాడ్



పీఠంలో నిర్వహిస్తున్న శ్రీనివాస కల్యాణం

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆధ్యాత్మికత వెల్లి విరుస్తోంది. పీఠం స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం భద్రాచలం సీతారామచంద్రమూర్తి ఆలయ వేద పండితులచే పీఠంలో సీతారామచంద్రమూర్తికి సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. స్వామివారి పట్టాభిషేకంలో భాగంగా పాదుకా సమర్పణ, రాజముద్రిక, రాజదండకం, నందక, ఛత్ర చామర, ఆభరణాల సమర్పణ, నదీజలాలతో అభిషేకం, మంగళాశాసనం వంటి పూజాధికాలు నిర్వహించారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ సీతారామ కల్యాణం, శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం విశిష్టతను భక్తులకు వివరించారు. వేడుకల్లో భాగంగా సాయంత్రం సమయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. తిరుపతికి చెందిన అర్చకులు బాలాజీ, పలువురు వేద పండితులు అర్చకత్వంలో పీఠంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత విజయవేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు వైఖానస ఆగమన విధానంలో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు.

లోక కల్యాణం కోసమే ..

పీఠంలో కల్యాణాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను లోక కల్యాణం కోసమే నిర్వహిస్తున్నట్లు విజయ దుర్గాపీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని తిలకించడం వలన సకల శుభాలు కలుగుతాయన్నారు. పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠానికి వచ్చిన భక్తులకు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి)ల ఆధ్వర్యంలో ఘనంగా అన్న సమారాధన చేశారు. విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు సత్యవెంకట కామేశ్వరి, భాస్కర నారాయణ దంపతులు, సత్య కనకదుర్గ, బి.రమ, కోట సునీల్‌కుమార్, కందర్ప హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల అందజేత

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో విద్యార్థులకు వాలీబాల్ కిట్ల పంపిణీ జరిగింది. ఇటీవల స్థానిక ఎస్‌టీఎస్ఎన్ఎం హైస్కూల్ జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు పాఠశాల విద్యార్థులకు వాలీబాల్ కిట్‌ను అందజేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఆయన వాలీబాల్ కిట్లను అందజేశారు. సర్పంచ్‌ను పలువురు అభినందించారు.

టీచర్ అసభ్య ప్రవర్తనపై కేసు

కొత్తపేట: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన టీచర్‌పై కేసు నమోదు చేసినట్లు కొత్తపేట ఏఎస్సై డి.శశాంక తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న ఆర్‌వీ సత్యనారాయణ ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని గత నెల 17న హెడ్ మాస్టర్ యాళ్ల చంద్రశేఖర్‌కు విద్యార్థినులు తెలిపారు. దీనిపై హెచ్ఎం మహిళా టీచర్లతో ఆ విద్యార్థినులను ఆరా తీయగా తాకకూడని చోట తాకినట్లు, అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిపారు. సదరు సత్యనారాయణను వివరణ కోరగా అటువంటి పని చేయలేదని, ప్రవర్తన మార్చుకుంటానని లిఖితపూర్వకంగా రాసిచ్చాడు. ఇదిలా ఉండగా ఈనెల 7, 8, 9 తేదీల్లో పడాల చారిటబుల్ ట్రస్ట్, కృత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థినీలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు సత్యనారాయణ అనే ఉపాధ్యాయుడు మాతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడంటూ ట్రస్ట్ వారికి రాతపూర్వకంగా తెలిపారు. విద్యార్థులు చెప్పిన విషయాన్ని ఆ స్కూల్ హెచ్ఎంకి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జరిగిన సంఘటనపై ప్రధానోపాధ్యాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీచర్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.